క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బండి ఆత్మకూరు: గ్రామ పంచాయతీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రత్నమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కార్మికులతో కలిసి ఎంపీడీఓ ఎం.దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు పోలయ్య, ప్రతాప్, మంగమ్మ, మోజెష్, నాగ పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో బైరెడ్డి మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో గురువారం జరిగిన సురేంద్ర, సునీతల వివాహానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి హాజరై వధూవరులపై అక్షింతలు చల్లి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, సర్పంచ్ కేశవరెడ్డి గారి నాగార్జునరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి నాగసేనారెడ్డి, ముచ్చుమర్రి సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో అడిషనల్ ఎస్పీ



మహానందీశ్వరుడి ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

మహానంది: మహానంది ఆలయంలో గురువారం రాత్రి హైదరాబాద్ సిటీ అడిషనల్ ఎస్పీ జానకిరెడ్డి పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.

భూముల వేలంలో రూ.2.3 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు: భోజనం గ్రామంలోని ముక్తేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూములకు గురువారం వేలం పాట నిర్వహించినట్లు ఆలయ ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆలయానికి 41 ఎకరాల భూమి ఉందన్నారు. వేలం పాటలో 13.73 ఎకరాలకు మాత్రమే వేలంపాట జరిగిందని.. దీని ద్వారా రూ.2.30 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మిగిలిన 27 ఎకరాల భూమికి సరైన ధర లభించకపోవడంతో వాయిదా వేశామని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కె.కార్తిక్, ఎస్ఐ జగన్ మోహన్, నాగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వెలుగోడు: లక్ష్మీ ప్రసన్న ఆంజనేయస్వామి



వెలుగోడు: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



శ్రీశైలం: ఆంజనేయస్వామి దీక్ష విరమిస్తున్న భక్తులు



ఆత్మకూరు: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

హనుమాన్ జయంతి వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో శోభా యాత్ర



బండి ఆత్మకూరు: పెద్దదేవళాపురంలో..



ఆత్మకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: హనుమాన్ జయంతిని గురువారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. శ్రీశైల దేవస్థానం పరిధిలోని ఆంజనేయస్వామికి ఉదయం విశేష పూజలు నిర్వహించారు. పాతాళ గంగ మార్గంలోని ప్రసన్న ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, జలాభిషేకం చేశారు. అనంతరం అష్టోత్తర పూజ, నాగవల్లిదళపూజ (ఆకుపూజ), వడమాల సమర్పణ, పుష్పార్చన జరిపారు. అలాగే సున్నిపెంట గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సుప్రభాతసేవ, అభిషేకం, ఆకుపూజ, నైవేద్య సమర్పణ చేశారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పఠించి పల్లకీ సేవ నిర్వహించారు.

- వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న అభయ ఆంజనేయస్వామికి విగ్రహ దాత కరణం రాఘవరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృత అభిషేకం, సామూహిక కుంకుమార్చన, జెండా ప్రతిష్ఠ మహోత్సవం, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, మన్యుసూక్త హోమం నిర్వహించారు. అశ్వర్థ నారాయణ ఆంజనేయ దేవస్థానంలో ధర్మకర్త తాళ్లూరి మురళీకృష్ణయ్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం నిర్వహించగా భక్తులు పాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

అభయాంజనేయుడికి సహస్ర ఆకుపూజ



మహానంది: దీపాలంకరణలో అభయాంజనేయుడు,



భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఈఓ, పండితులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన అభయాంజనేయస్వామికి ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు శివశంకర శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సింధూరంతో అర్చన, సహస్ర ఆకులతో పూజ, దీపార్చన చేశారు. పలు ప్రాంతాల భక్తులు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అలాగే గాజులపల్లె రైల్వేస్టేషన్‌లోని పంచముఖ ఆంజనేయస్వామికి ఆకుపూజ, మహా మంగళ హారతులు, ఆంజనేయపురంలోని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

- బండి ఆత్మకూరు: పెద్దదేవలాపురం గ్రామంలో వెలసిన ఏకశిలా అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ నిర్వాహకుడు శివరాజ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.
- ఆత్మకూరు: పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆకుపూజ, కుంకుమార్చన చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం పాత బస్టాండ్ నుంచి అమ్మవారిశాల వరకు భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్.. జై వీరాంజనేయ, జైహనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్‌తో పాటు ఆర్య వైశ్య సంఘం సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



పారుమంచాలలో స్వామివారి చరిత్రను వివరిస్తున్న టీటీడీ హిందూధర్మ ప్రచార కమిటీ సభ్యులు,



కొత్త ఎల్లాల దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి,



నందికొట్కూరు రామాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



కొత్త ఎల్లాలలో వైభవంగా సాగుతున్న రథోత్సవం

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, జూపాడుఆంజనేయస్వామి ఆలయం, పారుమంచాల, తూడిచెర్ల, కనకయ్యకొట్టాల, తర్తూరు, భాస్కరాపురం, తరిగోపుల, 80బన్నూరు, పోతులపాడు తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం తూడిచెర్ల గ్రామంలో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఆంజనేయస్వామివారి ఉత్సవ విగ్రహాన్ని, చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహించారు. పారుమంచాల గ్రామంలో భక్తులు విశేషభజన కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్త ఎల్లాలలో వైభవంగా రథోత్సవం

పగిద్యాల: మండలంలోని కొత్త ఎల్లాల గ్రామంలో వెలసిన అభయాంజనేయ స్వామి, సీతారామ లక్ష్మణస్వామి, చెన్నకేశవస్వామిల రథోత్సవ వేడుకలు గురువారం వైభవంగా సాగాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రథోత్సవం నిర్వహించారు. రథోత్సవాన్ని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. స్వామి వార్లను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జున రెడ్డి సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు పానకం పోసి అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఆయన వెంట ఎంపీటీసీ కళావతి, పాత ముచ్చుమర్రి సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగశేనారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బోయ మధు, రాజు, కురుమన్న, గౌడ్ తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిద్యాల, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాల్లోని ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

కార్యసాధకులకు హనుమంతుడే ఆదర్శం

నందికొట్కూరు: కార్యసాధకులకు హనుమంతుడే ఆదర్శమని ధార్మిక ప్రవచకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. పార్వతీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని రామాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వక్తలు హనుమాన్ జయంతి విశిష్టతపై ధార్మిక ప్రవచనాలు వినిపించారు. అలాగే పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. సమాజంలో ధార్మిక నిష్ఠను పెంచేందుకు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామాలయ కోశాధికారి ఎస్. శ్రీనివాసులు, అలువాల బాలయ్య, భక్తులు పారెడ్డి శివారెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం ప్రజలు హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. జి.వీరాపురం, కొత్తపల్లి, సింగరాజుపల్లె, నందికుంట, బావాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలో శ్రీరాముల వారి ఆలయాల్లో, ఆంజనేయుడి ఆలయాల్లో భక్తులు హనుమాన్‌జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు మెండు



నవధాన్యాల కిట్లను మహిళా రైతులకు అందజేస్తున్న ఏపీఎం అంబమ్మ, సీసీలు

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చునని ఏపీఎం అంబమ్మ తెలిపారు. గురువారం జూపాడు బంగ్లా రైతు ఉత్పత్తిదారుల కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసుకోవటం వల్ల భూమికి అవసరమైన సేంద్రియ కర్బనం, సూక్ష్మ ధాతువులు, పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు ఉత్పన్నమవ్వటంతో పాటు నేలగుల్లబారి సాగుచేసిన పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. అందుకుగాను 18రకాలైన జీలుగ, జనుము, జొన్న, మొక్కజొన్న, రాగులు, కొర్రలు, సజ్జలు, మినుములు, పెసలు, పిల్లిపెసర, ఉలవలు, అలసందలు, కందులు, పొద్దుతిరుగుడు, ఆవాలు, ఆముదం, మెంతులు, నువ్వులు అన్ని కలిపి ఎకరాకు 10కిలోల చొప్పున పొలంలో చల్లుకోవాలన్నారు. 18 రకాల ధాన్యాలు మొలకెత్తి నెలరోజులైన తర్వాత పొలంలో కలియదున్నుకోవటం వల్ల ఎకరాపొలంలో 10 టన్నుల ఎరువుతో సమానమన్నారు. తద్వారా పొలానికి అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం, మెగ్నిషియం, ఐరన్ తదితర పోషకాలన్నీ లభిస్తాయని చెప్పారు. అనంతరం నవధాన్యాల కిట్లను మహిళా రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీసీ కర్రెన్న, సీసీలు ధన్సింగ్, గాంధీ, నాగేశ్వరరావు, రమేష్‌నాయక్, బాలస్వామి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

'సిద్ధేశ్వరం' త్వరగా పూర్తి చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడ మాదిరిగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంత వరకు జిల్లాలో అభివృద్ధి శూన్యమన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి అలుగు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి పూర్తి చేయాలని కోరారు. ఈనెల 31న సిద్ధేశ్వరం వద్ద జరిగే ఆందోళనకు సీపీఐ, ఏపీ రైతు సంఘం సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ మహానాడులో అలుగు నిర్మాణంపై తీర్మానం చేసి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్, నాగరాముడు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో స్వచ్ఛసేవ

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన వీధులు, గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు, డొనేషన్ కౌంటర్, అన్నదాన విభాగం, గణేష సదన్, ఘంటామఠం, యాంఫిథియేటర్, టూరిస్ట్ బస్టాండ్, పాత ఫిల్టర్ బెడ్ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. దేవస్థాన అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది



ఆలయ ప్రధాన వీధిలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

చర్చి ఉత్సవాలను విజయవంతం చేయండి

ఆత్మకూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంలో ఉన్న తెలుగుబాపిస్ట్ చర్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎబిలేజర్ తెలుగు బాపిస్టు ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రెవరెండ్‌లు సజ్జీవరాజు, విజయ్‌కుమార్, బొంతా సామెల్, సజ్జన్‌కుమార్, జీవన్‌రావు, అనిల్‌కుమార్, సామేల్, లూక ప్రసాద్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈనెల 23 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

అక్రమ మద్యం అమ్మితే చర్యలు

కొత్తపల్లి: గ్రామాలలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్.జయశేఖర్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో గ్రామానికి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి ఇంటి వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన 63 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

విద్యార్థులకు అవార్డులు హర్షణీయం

పగిద్యాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులు మల్లన్న(593), జ్వాల యశస్విని(591) ఇటీవల రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉండవల్లిలో షైనింగ్ స్టార్స్ అవార్డులను అందుకోవడం హర్షణీయమని ప్రిన్సిపాల్ రవీంద్ర అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 47 మంది విద్యార్థుల్లో తమ పాఠశాల నుంచి ఇద్దరు ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు.

పొలం ఇప్పించండి



తహసీల్దార్‌ను ఆశ్రయించిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ జీఎస్ రాజు

పగిద్యాల: పదిహేను ఏళ్ల దేశానికి సేవలు అందించినందుకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని తనకు ఇప్పించాలని రిటైర్డ్ ఆర్మీ జవాన్ జీఎస్ రాజు గురువారం తహసీల్దార్ శివరాముడును ఆశ్రయించారు. బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన జీఎస్ రాజు 1963లో మిలిటరీలో చేరారు. 1965లో భారత్, పాకిస్తాన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి విజయం సాధించామని వాపోయారు. జమ్ము, కాశ్మీర్ బార్డర్‌లో పనిచేసిన తాను 1975లో రిటైర్డ్ అయినట్లు వెల్లడించారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వం లక్ష్మాపురం పొలిమేరలో సర్వే నం. 731/2 లో 1.48 ఎకరాలు, సర్వే నం. 735/3లో 2.37 ఎకరాలు 1986లో కేటాయించిందని తెలిపారు. అయితే ఈ పొలాన్ని 1988లో పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన వైకుంఠం కుమారుడైన ఆర్. వెంకటసుబ్బయ్య అసైన్‌మెంట్ కమిటీ ద్వారా డి- పట్టా తీసుకుని ఆన్‌లైన్ చేసుకున్నాడని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ పాత రికార్డులను పరిశీలించి 10(1) అడంగల్‌ను రద్దు చేసి అసైన్‌మెంట్ కమిటీ వెంకటసుబ్బయ్యకు డి-పట్టా ఇచ్చినట్లు జవాన్‌కు వివరించారు. అసైన్‌మెంట్ కమిటీ ఇచ్చిన పట్టాను రద్దు చేయాలంటే తన పరిధిలో లేదని ఆర్డీఓకు నివేదిక పంపుతామని జవాన్‌కు తెలిపారు.

రేపు లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

నందికొట్కూరు: పట్టణంలోని అలువాల సత్రంలో ఈ నెల 24వ తేదీన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు అలువాల బాలయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులందరూ విచ్చేసి స్వామి వారి కళ్యాణం తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఉదయం 5 గంటల నుంచి ప్రజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 9 గంటలకు కల్యాణ మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

'సూపర్ సిక్స్' అమలుకు ఇబ్బందులు



మాట్లాడుతున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నందికొట్కూరు: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, సమస్యలను ప్రజలు అర్థం చేసుకుంటారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయం ఆవరణలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా వీరం ప్రసాదరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి బీసీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా మార్కెట్ యార్డు కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయన్నారు. నందికొట్కూరు-పగిద్యాల రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటానని, రోడ్డు, భవనాల శాఖలో వనరులు లేవని ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. అనంతరం కర్నూలు-దోర్నాల నేషనల్ హైవే రోడ్డు వేయడంతో నాగలూటి, తత్తూరు, పారుమంచాల, తరిగోపుల గ్రామాలకు వెళ్లేందుకు బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.